నాలా పనుల పరిశీలన



శేరిలింగంపల్లి: నాలా నిర్మాణ పనులను జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు శనివారం పరిశీలించారు. శేరిలింగంపల్లి హుడా ట్రేడ్‌ సెంటర్‌ వద్ద జరుగుతున్న పనులను ఎస్‌ఎన్‌డీపీ చీఫ్‌ ఇంజనీర్‌ కోటేశ్వరరావు, డీఈ ధీరజ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ నాలా నిర్మాణం పూర్తయితే డ్రైనేజీ, వరద నీటి సమస్య తీరుతుందన్నారు.

రక్తదాతలకు సత్కారం



శేరిలింగంపల్లి: రక్తదానం ప్రాణదానంతో సమానమని ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ కన్వీనర్‌ తాడిబోయిన రామస్వామి యాదవ్‌ అన్నారు. శేరిలింగంపల్లి ఆదర్శనగర్‌ కమ్యూనిటీ హాల్‌లో ఫ్రెండ్స్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని శనివారం నిర్వహించారు. 25 సార్లు రక్తదానం చేసిన వారిని సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్‌ కన్వీనర్‌ రామస్వామి యాదవ్‌ మాట్లాడుతూ రక్త దానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్‌ ప్రతినిధులు జనార్దన్‌, అమ్మయ్య చౌదరి, పాలం శ్రీను, జీవీ రావు, ప్రేమ్‌సింగ్‌, వెంకటేశ్వర్‌రావు, మహేష్‌ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు అదృశ్యం


జగదీష్‌ కుమార్‌ (ఫైల్‌)

మియాపూర్‌: ఉద్యోగం కోసం నగరానికి వచ్చిన యువకుడు అదృశ్యమైన సంఘటన మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పొన్నూరు తాలుకా ఆరమండ గ్రామానికి చెందిన సూరినేని జగదీష్‌కుమార్‌(32) గత నెల 27వ తేదీ నగరానికి వచ్చి మియాపూర్‌ న్యూ హఫీజ్‌పేట్‌ మార్తాండ నగర్‌లో స్నేహితుడు అరవింద్‌ కుమార్‌తో కలిసి ఉంటున్నాడు. ఈ నెల 10వ తేదీ ఉదయం 3 గంటల సమయంలో జగదీష్‌ కుమార్‌ బ్యాగు తీసుకుని బయటకు వెళ్లాడు. తిరిగి రాలేదు. దీంతో అతని స్నేహితుడు అరవింద్‌ తండ్రి సూరినేని పోలేశ్వర్‌రావుకు సమాచారం అందించాడు. కుటుంబ సభ్యులు పలుచోట్ల విచారించినా ఆచూకి లభించలేదు. దీంతో తండ్రి పోలేశ్వర్‌రావు మియాపూర్‌ పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చందానగర్‌: చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన చందానగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం 2023 సంవత్సరం ఆగస్టు 17వ తేదీ రాత్రి 9.00 గంటలకు ఓల్డ్‌ ఎంఐజీలోని పోచమ్మ దేవాలయం సమీపంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి (35) కింద పడిపోయాడు. దీనిని గమనించిన పెట్రోలింగ్‌ పోలీసులు చికిత్స కోసం గాంధీ ఆసుపత్రికి తరలించారు. గత రెండు సంవత్సరాల నుంచి చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు చందానగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

మందుబాబులకు జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.... శుక్రవారం నిర్వహించిన డ్రైవ్‌లో 9 మందిని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహనదారులను శనివారం సంగారెడ్డి కోర్టులో హాజరుపర్చగా 9 మందికి రూ. వెయ్యి చొప్పున జరిమాన విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

మినీ ఫంక్షన్‌హాల్‌..

పిల్లర్లకే పరిమితం



శేరిలింగంపల్లి: మూడేళ్లుగా పిల్లర్లకే పరిమితమైంది మినీ ఫంక్షన్‌హాల్‌. శేరిలింగంపల్లిలో మినీ ఫంక్షన్‌ హాల్‌ నిర్మాణం కోసం రూ.25 లక్షల వ్యయం అవుతుందని అంచనా వేశారు. నిధులు మంజూరవడంతో కమ్యూనిటీహాల్‌ నిర్మాణానికి మూడేళ్ళ క్రితం ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌లు శంకుస్థాపన చేశారు. లింగంపల్లి గ్రామంలో చిరుద్యోగులు, కార్మికులు అధికంగా ఉంటారు. వీరికి ఈ కమ్యూనిటీహాల్‌ ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. కమ్యూనిటీ హాల్‌ నిర్మాణ పనులను మూడేళ్ల క్రితం ప్రారంభించి పిల్లర్లు వేశారు. ఈ దశలో పనులు ఆగిపోయాయి.ఆ తర్వాత ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోలేదని స్థానికులు వాపోతున్నారు. కమ్యూనిటీ హాల్‌ నిర్మించతలపెట్టిన స్థలంలో ఉన్న పురాతన భవనంలో లింగంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం ఉండేది. దానికి భవనం అందుబాటులోకి రావడంతో ఆ తర్వాత ప్రాథమిక పాఠశాల నిర్వహించారు. దీనికీ సొంత భవనం ఏర్పడడంతో వెటర్నరీ ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దానికీ సొంత భవనం అందుబాటులోకి రావడంతో జన విజ్ఞానకేంద్రంగా మార్పు చేశారు. ఆ తర్వాత అంగన్‌వాడీ కేంద్రంగా మారింది. తర్వాత దాన్ని మరోచోటుకు తరలించి ఇక్కడ మినీ కమ్యూనిటీహాల్‌ నిర్మాణం చేయాలని తలపెట్టి పురాతన భవనాన్ని కూల్చివేసి పనులు చేపట్టారు. అవి మధ్యలోనే ఆగిపోయాయి.

త్వరితగతిన పూర్తి చేయాలి

మినీ ఫంక్షన్‌హాల్‌ నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి. రూ.25 లక్షల వ్యయంతో 3 ఏళ్ల క్రితం పనులు ప్రారంభించి ఇప్పటికీ పూర్తి చేయలేదు. అధికారులు, ప్రజా ప్రతిని.ధులు చర్యలు చేపడితేనే పూర్తవుతుంది. ఇది స్థానికులు చిన్నచిన్న ఫంక్షన్లను చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. ఆదిశగా చర్యలు చేపట్టాలి

– దేవులపల్లి శ్రీనివాస్‌, అడ్వైజర్‌, లింగంపల్లి విలేజ్‌ డెవలప్‌మెంట్‌ కమిటీ

పనులు పూర్తయ్యేలా చర్యలు

లింగంపల్లి కమ్యూనిటీ హాల్‌ నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు తగిన చర్యలు తీసుకుంటాం. అందుకోసం త్వరితగతిన పనులు ప్రారంభించి, భవనాన్ని పూర్తి చేస్తాం.

– ఆనంద్‌, డీఈఈ, శేరిలింగంపల్లి సర్కిల్‌



మినీ కమ్యూనిటీహాల్‌ కోసం తేదీ లేకుండా శిలాఫలకం

రోడ్డు విస్తరణ పనులు వెంటనే ప్రారంభించాలి

బీజేపీ నాయకుల నిరసన


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకుడు రవికుమార్‌ యాదవ్‌, నాయకులు

చందానగర్‌: చందానగర్‌ డివిజన్‌ పరిధిలోని శ్రీదేవి థియేటర్‌ నుంచి అమీన్‌పూర్‌ బంధంకొమ్మును కలిపే రోడ్డు నిర్మాణానికి 7 సంవత్సరాల క్రితం శంకుస్థాపన చేశారని, ఇంతవరకు పనులు ప్రారంభించలేదంటూ శనివారం బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు బుచ్చిరెడ్డి అధ్యక్షతన, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌ యాదవ్‌ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018వ సంవత్సరంలో సుమారు రూ.4 కోట్లతో రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారని ఇప్పటి వరకు పనులు చేపట్టకపోవడంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. బీహెచ్‌ఎల్‌ నుంచి శ్రీదేవి థియేటర్‌, అమీన్‌పూర్‌ బంధం కొమ్ము వరకు జీహెచ్‌ఎంసీ రూ.45 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రూ.17 కోట్లు, ఎస్‌డీఎఫ్‌ ద్వారా రూ.7 కోట్ల నిధులు మంజూరు అయ్యాయన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అమీన్‌పూర్‌ సరిహద్దు వరకు రోడ్డు విస్తరణ పనులు పూర్తికాగా, చందానగర్‌ పరిధిలో ఉన్న 2 కిలోమీటర్ల పనులు మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు ఉన్నాయన్నారు. చుట్టు పక్కల ప్రజలు ప్రతి రోజు గుంతల రోడ్డుతో నరకం చూస్తున్నారన్నారు. తక్షణమే రోడ్డు పనులు ప్రారంభించాలని లేని ఎడల రాస్తారోకోలు, ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రావు, రాఘవేంద్రరావు, నాగులు గౌడ్‌, బుచ్చిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రాంరెడ్డి, రాధకృష్ణ యాదవ్‌, డాక్టర్‌ వంశీ, సింధూరెడ్డి, బోయిని మహేష్‌ యాదవ్‌, రాజు శెట్టి, పద్మ, విజయ ,స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ కార్డియాలజీ సదస్సు ప్రారంభం



సదస్సులో పాల్గొన్న యశోద ఆస్పత్రి మేనేజింగ్‌ డైరెక్టర్‌ డా.రావు, కార్డియాలజిస్టులు

మాదాపూర్‌: కార్డియో వాస్క్యులర్‌ డిసీజ్‌ కేసులు రోజురోజుకు పెరుగుతున్నాయని యశోద గ్రూప్‌ ఆఫ్‌ హాస్పిటల్స్‌ మేనేజింగ్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ జి.ఎస్‌ రావు తెలిపారు. మాదాపూర్‌లో యశోద ఆసుపత్రుల ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు గుండె జబ్బుల చికిత్సలో అత్యాధునిక విధానాలపై అంతర్జాతీయ కార్డియాలజీ సదస్సు, లైవ్‌ వర్క్‌షాప్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. రావు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కార్డియోవాస్కులర్‌ డిసిజ్‌ అత్యధికంగా ఉన్న దేశాలలో భారతదేశం ఒకటి అన్నారు. భారతదేశంలో సివిడి వార్షిక మరణాల సంఖ్య 2.26 మిలియన్ల నుంచి 4.77 మిలియన్లకు పెరిగిందన్నారు. కార్యక్రమంలో 500 మంది కార్డియాలజీ వైద్యనిపుణులు పాల్గొన్నారు.

మెడికవర్‌, టెక్‌ మహీంద్ర 5కె రన్‌

మాదాపూర్‌: రన్‌ కేవలం శారీరక సామర్థ్యాన్ని పరీక్షించడమే కాదని ఆరోగ్యాన్ని ,సమైక్యతను పంచుకునే కార్యక్రమమని మెడికవర్‌ ఆస్పత్రి పల్మనాలజిస్ట్‌ డాక్టర్‌ మేఘనా సుభాష్‌ తెలిపారు.అంతర్జాతీయ వెల్‌నెస్‌ డే సందర్భంగా మాదాపూర్‌లోని మెడికవర్‌, టెక్‌ మహీంద్ర సంయుక్తంగా 5కె రన్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో మెడికవర్‌ హాస్పిటల్స్‌ ఏజీఎం కార్పొరేట్‌ రిలేషన్స్‌ శైలజకోట, ఉద్యోగులు, సిబ్బంది, టెక్‌ మహీంద్ర ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



అలరించిన కూచిపూడి విభావరి


శిల్పారామంలో..


అన్నమయ్యపురంలో..

మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహించే వారాంతపు కార్యక్రమాలలో భాగంగా శనివారం సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కూచిపూడి నాట్య గురువు మద్దాలి ఉష గాయత్రి శిష్యబృందంచే కూచిపూడి విభావరి ఆకట్టుకుంది. ఇందులో శివదీక్ష, ప్రహ్లాద పట్టాభిషేకం, బాల కనకమయ, చక్కనితల్లికి, శ్రీకృష్ణ జనన శబ్దం, అలరులు కురియగా, గొల్లకలాపం, తిల్లాన తదితర అంశాలను కళాకారులు వాసవిచౌదరి, ఆశ్రితషిండే, యశస్వినీ, శ్రద్ధ వారణాసి, సహస్ర చరిష్య తదితరులు ప్రదర్శించారు.

అన్నమయ్యపురంలో..

అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమయ్య స్వరార్చనలో భాగంగా భాస్కర్‌ డ్యాన్స్‌ అకాడమీ డి.సాత్విక శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శనతో అలరించారు. ఇందులో కుంభహారతి, అలరిపు, గణపతి తాళం, ముద్దుగారే యశోద, శివకైవరం తదితర అంశాలను కళాకారులు హాస్నవి, శ్రీశ్విత, హర్షిత, లక్ష్మిప్రణతి, మనస్వి, వైష్ణవి, శ్రీహిత, బాలభవ్యశ్రీ, సహస్ర ధరణిత, ప్రజ్ఞ, సౌగంధిక, శరణ్య, తనుశ్రీ నవ్య, ఆరాధ్య, శ్రీవల్లి , పర్థిక, శంకరి, హాసిని ప్రదర్శించారు.

'నీట్‌'లో గురుకుల బాలుర సత్తా

రాయదుర్గం: 'నీట్‌' పరీక్షలో గౌలిదొడ్డి సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. శనివారం కళాశాల ప్రిన్సిపల్‌ అంజయ్య వివరాలను తెలిపారు. ఎం శేఖర్‌- 479, శ్రీకాంత్‌-642, సందీప్‌-1,514, ఎం మూర్తి -1,898, డి మహదేవ్‌, అశోక్‌లు మంచి ర్యాంకులను సాధించారన్నారు. కళాశాలనుంచి 22 మంది ఎంబీబీఎస్‌, అయిదుగురు బీడీఎస్‌, ఆరుగురు ఆయుష్‌లో సీట్లు లభిస్తాయని తెలిపారు. ర్యాంకర్లను గురుకుల సంస్థ కార్యదర్శి డాక్టర్‌ అలుగు వర్షిని, ఇతర ఉన్నతాధికారులు అభినందించారు.


మూర్తి 488 (1989 ర్యాంకు)


శ్రీనాథ్‌ 472 (642 ర్యాంకు)


శేఖర్‌ 479 (526 ర్యాంకు)


రోహిత్‌కి 468 (4096 ర్యాంకు)


మహదేవ్‌ 517 (16,234 ర్యాంకు)


అశోక్‌ 493 (28,781 ర్యాంకు)

అన్నదాతలకు అవగాహన

పటాన్‌చెరు: పటాన్‌చెరు మండలం రామేశ్వరం బండ గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొఫెసర్‌ జయశంకర్‌ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో శాస్త్రవేత్తలు డాక్టర్‌ రాధిక, డాక్టర్‌ షరీన్‌, ఏఎస్‌ కే శివకుమార్‌, పంచాయతీ సెక్రటరీ జ్యోతి, మాజీ ఎంపీటీసీ అంతిరెడ్డి కార్యక్రమంలో పాల్గొని రైతులకు పంటలపైన అవగాహన కల్పించారు.యూరియా వాడకం, రసాయన ఎరువుల మోతాదు, సేంద్రియ ఎరువుల వాడకం, సాగు నీటి ఆదా, రసీదులను భద్రపరచడం, చెట్ల పెంపకం, పంట మార్పిడి తదితర అంశాలపై అవగాహన కల్పించారు.కార్యక్రమంలో రామేశ్వరంబండ గ్రామస్తులు అంజనేయులు, శ్రీనివాస్‌ రెడ్డి, రాము, హిబ్బు, అర్జున్‌, నవీన్‌, శ్రీనివాస్‌, మల్లేష్‌, జనార్దన్‌, మన్నె సురేష్‌, మన్నె గోవర్ధన్‌, మన్య లక్ష్మణ్‌ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌గడ్డ కిటకిట



పటాన్‌చెరు టౌన్‌: సంకటహర చతుర్థి సందర్భంగా పటాన్‌చెరు మండలం రుద్రారం గణేష్‌గడ్డ ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి దర్శనానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు.అర్చకులు సంతోష్‌ జోషి, జగదీశ్వర్‌ స్వామి, చంద్రశేఖర్‌, అయ్యప్ప, సతీష్‌లు పూజలు, హోమం చేశారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ లావణ్య, జూనియర్‌ అసిస్టెంట్‌ ఈశ్వర్‌ తెలిపారు.



హెచ్‌సీయూలో క్లీనప్‌ డ్రైవ్‌



రాయదుర్గం: హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఎన్‌ఎస్‌ఎస్‌ విభాగం సమన్వయకర్త డాక్టర్‌ కృష్ణయ్య, ప్రోగ్రామ్‌ ఆఫీసర్‌ ప్రొఫెసర్‌ భీమ్‌సింగ్‌ ఆధ్వర్యంలో శనివారం క్లీనప్‌ డ్రైవ్‌ నిర్వహించారు. ఎన్‌ఎస్‌ఎస్‌ వాలంటీర్లు, సత్కర్మ్‌ వాలంటీర్లు, సౌత్‌ షాపింగ్‌ కాంప్లెక్స్‌, స్కూల్‌ ఆఫ్‌ లైఫ్‌ సైన్సెస్‌ ప్రాంగణంను శుభ్రం చేశారు. ప్లాస్టిక్‌ బాటిల్స్‌, సంచులు, గాజు సీసాలు, చెట్ల కొమ్మలు ,చెత్తాచెదారం తొలగించారు. వీటన్నింటిని ట్రాక్టర్‌లో డంపింగ్‌ యార్డ్‌కు తరలించారు.

రక్తదానం ప్రాణదానమే..

రక్తదానం ప్రాణాలు కాపాడుతుందని హెచ్‌సీయూ హెల్త్‌ సెంటర్‌ చీఫ్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ అనుపమ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ క్యాంపస్‌లో శనివారం ఎన్‌ఎస్‌ఎస్‌ హెచ్‌సీయూ విభాగం సత్కార్క్‌ హైదరాబాద్‌ సంయుక్తంగా రక్తదాత దినోత్సవాన్ని నిర్వహించారు. రక్తదానం గురించి యువతకు మరింత అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్‌ ప్రోగామ్‌ ఆఫీసర్‌ ప్రొఫెసర్‌ భీమ్‌సింగ్‌, అసోసియేట్‌ ప్రొ. నాగమణి, సత్కర్మ్‌ ప్రతినిధి ఆరుషి పాల్గొన్నారు.

నాలాలో వ్యర్థాల తొలగింపు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి జిల్లాపరిషత్‌ హైస్కూల్‌ ఎదుట ఉన్న నాలాలో వ్యర్థాలను శనివారం తొలగించారు. వర్షాకాలం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ డీఆర్‌ఎఫ్‌ టీం ఆధ్వర్యంలో వరద నీరు లింగంపల్లి రైల్వే అండర్‌ బ్రిడ్జి వద్ద సాఫీగా వెళ్ళేలా అవసరమైన చర్యలు చేపట్టారు. భారీ వర్షం కురిసినా రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా పనులు చేస్తున్నారు. కాగా తీసిన పూడిక, వ్యర్థాలను వెంటనే తరలించాలని స్థానికులు సూచిస్తున్నారు. హైస్కూల్‌ ముందుభాగంలో 15 రోజుల క్రితం తీసిన పూడిక అక్కడే వదిలేయడంతో ఇటీవల కురిసిన వర్షానికి తిరిగి నాలాల్లోకి వెళ్తుంది.అధికారులు తొలగించిన పూడికను వెంటనే ఎత్తివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


నాలాలో పూడికను తొలగిస్తున్న దృశ్యం


శేరిలింగంపల్లి హైస్కూల్‌ ముందు భాగంలో పూడిక తరలించని దృశ్యం

ప్రధాన రోడ్లపై చెత్త

- అపరిశుభ్రత .. దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు, వాహనదారులు


మాదాపూర్‌ అయ్యప్పసొసైటీలో చెత్తకుప్పలు



మాదాపూర్‌: ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండాల్సిన రోడ్లన్నీ చెత్తతో అపరిశుభ్రంగా తయారయ్యాయి. నిత్యం ఐటీ ఉద్యోగులతో రద్దీ, అంతర్జాతీయ సదస్సులకు నిలయంగా ఉన్న మాదాపూర్‌ ప్రాంతంలో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోతోంది. దీంతో వాహనదారులు, పరిసర ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక వర్షం పడిందంటే దుర్వాసనను వెలువడుతోంది. ఈగలు, దోమలు ప్రబలి రోగాలబారినపడుతున్నారు. స్థానికులు చెత్త సమస్యపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా జీహెచ్‌ఎంసీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మాదాపూర్‌లోని సాయినగర్‌, చంద్రానాయక్‌తండా సర్వే ఆఫ్‌ ఇండియా, సియట్‌ కాలనీ తదితర ప్రాంతాలలో ప్రధాన కూడళ్ల వద్ద చెత్త వేస్తున్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.




సర్వే ఆఫ్‌ ఇండియా సొసైటీలో..


సున్నం చెరువు వద్ద..

మొక్కలు నాటాలి.. సంరక్షించాలి

ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి


మొక్క నాటుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి

పటాన్‌చెరు: భవిష్యత్‌ తరాలకు ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ఉందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌ రెడ్డి అన్నారు. శనివారం అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని చక్రపురి కాలనీలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మున్సిపాలిటీలలో నిర్వహిస్తున్న వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వన మహోత్సవం- మొక్కలు నాటుదాం కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై.. మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ, ప్రైవేటు ఖాళీ స్థలాలతో పాటు పార్కులు, గేటెడ్‌ కమ్యూనిటీలు, దేవాలయాలు, పరిశ్రమల ఆవరణలో మొక్కలు నాటాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్‌ మాజీ చైర్మన్‌ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్‌పూర్‌ మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మున్సిపల్‌ కమిషనర్‌ జ్యోతిరెడ్డి, మాజీ ప్రజా ప్రతినిధులు, సీనియర్‌ నాయకులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి సహకారం

అమీన్‌పూర్‌ మున్సిపల్‌ పరిధిలోని చక్రపురి కాలనీలో రిటైర్డ్‌ ఉద్యోగులు తమ సొంత నిధులతో నిర్మిస్తున్న శివాలయాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. ఆలయ నిర్మాణానికి సంపూర్ణ సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.